అవినీతి రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములవ్వాలి


విద్యాంజలి స్కూలు విద్యార్థుల ర్యాలీ

శేరిలింగంపల్లి: దేశ సమగ్రత, శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ డివిజనల్ సేల్స్ హెడ్ సీతేష్ కిషన్ తెలిపారు. విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకొని శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీలోని విద్యాంజలి హైస్కూల్ విద్యార్థులతో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ అవినీతి రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అవినీతిపై పోరాడేందుకు ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలత్రిపుర సుందరి, మేనేజర్ జేబీఎస్ విద్యాధర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



చందానగర్: చందానగర్‌లో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో చివరిరోజు సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి ఉత్సవాన్త స్నపనము, విశేషపూజ, మధ్యాహ్నం 12 గంటలకు హారతి, తీర్థప్రసాదములు, సాయంత్రం 6.30 గంటల నుంచి 7.30 గంటల నుంచి పుష్పక వాహన సేవ, రాత్రి 8 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పుష్పయాగం నిర్వహించారు. ఉత్సవాలలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'మనూ'లో వాక్ ఇన్ అడ్మిషన్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(ఐటీఐ)లో మంగళవారం వాక్ ఇన్ అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ తెలిపారు. మంగళవారం ఉదయం 'మనూ' క్యాంపస్‌లోని ఐటీఐ భవనంలో ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డ్రాఫ్ట్స్‌మెన్(సివిల్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానిక్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్, ప్లంబర్ కోర్సులలో సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆమె వివరించారు. వివరాలకు 040–23008428, 9440692452లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

ప్రధానరోడ్డులో సంత వద్దు

- జీహెచ్‌ఎంసీ అధికారుల ఆదేశాలు
- మా పొట్టకొట్టొద్దంటున్న కూరగాయల వ్యాపారులు
- ఖాజాగూడలో సంత నిర్వహణకు స్థలం చూపాలని స్థానికుల డిమాండ్


ఖాజాగూడ ప్రధాన రోడ్డు పక్కన సంత (ఫైల్)

రాయదుర్గం: నేడు ఆన్‌లైన్ ఆర్డర్లు పెరిగినా సంతల ప్రాముఖ్యత తగ్గలేదు. ఏళ్లుగా గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో ప్రధాన రహదారి పక్కన మంగళవారం సంత జరుగుతుంది. ఇటీవల జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రధానరోడ్డులో సంత నిర్వహించరాదంటూ ఆదేశాలు జారీ చేయడంతో నేడు మంగళవారం సంత నిర్వహించాలా ?వద్దా..? తర్జనభర్జన జరుగుతోంది. ప్రతి మంగళవారం ఉదయం పది గంటల నుంచి కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, ఇతర వస్తువులు, దుస్తులు రకరకాలను అందుబాటులో ఉంచడంతో పేద, సామాన్య మధ్యతరగతి వారే కాకుండా ఉద్యోగులు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీవాసులు సైతం ఈ సంతలకు వస్తున్నారు. కాగా సంతను కొనసాగించాలని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు. అంతేకాకుండా సంత నిర్వహణకు అనువైన చోటును కేటాయించాలని కూరగాయల వ్యాపారులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఖాజాగూడలో అంతర్గత రోడ్లపై సంతను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కబడ్డీలో సత్తా చాటిన గంగోత్రి స్కూల్ విద్యార్థులు


విజేతలతో కరస్పాండెంట్ సర్వేశ్వర్‌రెడ్డి

రాయదుర్గం: కబడ్డీ పోటీల్లో రాయదుర్గం గంగోత్రి స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. స్పోర్ట్స్ ఫర్ ఆల్ (ఎస్ఎఫ్ఏ) ఆధ్వర్యంలో యూసఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో అయిదు రోజుల పాటు జరిగిన టోర్నమెంట్‌లో అండర్–17 విభాగంలో ఈ పాఠశాల జట్టు మొదటిస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ కన్నానాయుడు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల కరస్పాండెంట్ సర్వేశ్వర్‌రెడ్డి కబడ్డీ జట్టును, పీఈటీ రమేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలలో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని మదర్‌సేవా సమితి చైర్మన్ బి.కొండల్‌రెడ్డి సోమవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. 2,3 ఫ్లోర్‌లకు అనుమతులు తీసుకొని 5,6 ఫ్లోర్‌లను నిర్మిస్తున్నారని, ఇదంతా టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది అండదండలతో సాగుతున్నాయని తెలిపారు. పార్కింగ్ ఏరియాల్లో కూడ నిర్మాణాలు చేసి దుకాణాలకు అద్దెకు ఇస్తున్నారన్నారు.

13 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌లో 15 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 13 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమాన, ఒకరికి 2 రోజులు, మరో వ్యక్తికి 3రోజుల జైలు, జరిమాన విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

సమన్వయ లోపం.. స్థానికులకు శాపం

అంతర్గత రోడ్లు అస్తవ్యస్తం

- అభివృద్ధి పనులు పూరైనా పట్టించుకోని అధికారులు
- సమస్యలు పరిష్కరించాలని ప్రజల డిమాండ్



ఆల్విన్‌కాలనీ: అధికారుల నడుమ సమన్వయ లోపం స్థానికుల పాలిట శాపంగా మారింది. రాకపోకలకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయా కాలనీలవాసులు వాపోతున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా అంతర్గత రహదారులు తవ్వి పనులు పూర్తి అయిన తరువాత పట్టించుకోకపోవడంతో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. జలమండలి, జీహెచ్‌యంసీ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో అభివృద్ధి నత్తనడకన సాగుతోందని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు వాపోతున్నారు. మంచినీరు, డ్రైనేజీ పైపులైన్‌లు వేసిన అనంతరం అంతర్గత రహదారుల్లో సీసీ రోడ్లు వేయవలసిన అధికారుల అలసత్వం కారణంగా రోడ్డుపై చిన్నారులు, వృద్ధులు నడవలేని పరిస్థితి నెలకొంది. ఆల్విన్‌కాలనీ డివిజన్ సాయినగర్‌లోని సాయిబాబా ఆలయం రోడ్డులో డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ పనులు చేసి సుమారు 6 నెలలు కావస్తున్నది. ఇప్పటికీ సీసీ రోడ్డు వేయలేదు. దీంతో వాహనదారులు, స్కూలుకు వెళ్లే చిన్నారులు, బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. సాయిబాబా ఆలయం రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ఇక ఆలయం సమీపంలో కూడా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం రోడ్లను తవ్వి పైపులైన్ పూర్తి చేసి నెలలు గడుస్తున్నా వాటికి ప్యాచ్ వర్కులు కూడా చేయకపోవటంతో కంకర తేలాయని స్థానికులు వాపోతున్నారు. రహదారులను తవ్వినప్పుడు జలమండలి, జీహెచ్‌యంసీ అధికారులు సమన్వయంతో ప్యాచ్ వర్కులు, సీసీ రోడ్లు వేయాల్సి ఉంటుంది. కానీ శాఖల మధ్య సమన్వయ లోపంతోనే పనుల్లో జాప్యం జరుగుతున్నదని విమర్శిస్తున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు కోరుతున్నారు.



సాయిబాబా ఆలయం వద్ద అంతర్గత రోడ్ల దుస్థితి

శేరిలింగంపల్లి జలమండలి .. ఇకపై

దుర్గంచెరువు, హఫీజ్‌పేట్ డివిజన్లుగా..

నూతన డివిజన్‌ల పేర్లు, వివరాలు..

'దుర్గం చెరువు' 15 డివిజన్
జనరల్ మేనేజర్ బ్రిజేష్ : 9989989679

మాదాపూర్ సబ్ డివిజన్ :
- శరత్‌కుమార్‌రెడ్డి (డీజీఎం, మాదాపూర్) : 9989988370
- బి.యాదయ్య (మేనేజర్, మాదాపూర్) : 9154297400
- సందీప్‌కుమార్ (మేనేజర్, కొండాపూర్) : 9550731232
- విక్రమ్‌రెడ్డి (మేనేజర్, డోయన్స్) : 9989989382

నల్లగండ్ల సబ్ డివిజన్ :
- నరేందర్‌రెడ్డి (డీజీఎం/మేనేజర్, గచ్చిబౌలి) : 7331185784
- అభిషేక్ (మేనేజర్, నల్లగండ్ల) : 9154867438

'హఫీజ్‌పేట్' 17 డివిజన్
జనరల్ మేనేజర్ నారాయణ : 9989988615

మియాపూర్ సబ్ డివిజన్ :
- వెంకటేశ్వర్లు డీజీఎం (మియాపూర్), మేనేజర్ (హఫీజ్‌పేట్) : 9989997518
- సునీత (మేనేజర్, మియాపూర్) : 9154867431
- ఎస్‌వీఎస్ సుబ్రమణ్యం రాజు (మేనేజర్, చందానగర్) : 9989989045
- బిక్కులాల్ (మేనేజర్, దీప్తిశ్రీనగర్) : 7995010492

ఆర్సీపురం సబ్ డివిజన్ :
- శివకృష్ణ (డీజీఎం/మేనేజర్, పటాన్‌చెరు) : 7337350848
- అభిషేక్ (ఇంచార్జి మేనేజర్, ఆర్సీపురం) : 9154867438


హఫీజ్‌పేట్‌లో శేరిలింగంపల్లి డివిజన్ జలమండలి కార్యాలయం

ఇద్దరు జీఎంలు, నలుగురు డీజీఎంలు

- హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీలో కనుమరుగవనున్న 'శేరిలింగంపల్లి' పేరు
- విభజనతో మెరుగైన నీటి సరఫరా.. త్వరితగతిన సమస్యల పరిష్కారం


డివిజన్ 17 జీఎంగా నారాయణ


డివిజన్15 జీఎంగా బ్రిజేష్

చందానగర్: శేరిలింగంపల్లి జలమండలిని రెండు డివిజన్లుగా విభజించారు. శేరిలింగంపల్లి 15వ డివిజన్‌లోని ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా.. మెరుగైన నీటి సరఫరా కోసం చర్యలు తీసుకుంటున్నారు. సుమారు 84వేల మంచినీటి కనెక్షన్లు ఉండగా, డివిజన్ విస్తీర్ణం మాదాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు సుమారు 15 కిలోమీటర్ల ఉంది. రోజురోజుకు పెరుగుతున్న గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు, బస్తీల్లో నూతన పైప్‌లైన్లు, సీవరేజ్ పనుల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తున్న నేపథ్యంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ బోర్డు రెండు డివిజన్లుగా విభజించారు. శేరిలింగంపల్లి డివిజన్ బదులుగా ఇక నుంచి దుర్గం చెరువు డివిజన్ 15గా, హఫీజ్‌పేట్ డివిజన్ 17గా మార్పులు చేశారు. పాలనాపరమైన సమస్యల పరిష్కారంతో పాటు కాలనీలు, బస్తీలకు మరింత చేరువగా ఉండేందుకు కొత్తగా డివిజన్‌లను ఏర్పాటు చేశామని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. ఇప్పుడు ఉన్న శేరిలింగంపల్లి డివిజన్ జలమండలి కార్యాలయం హఫీజ్‌పేట్ 15వ డివిజన్‌కు, మాదాపూర్ దుర్గం చెరువు సమీపంలో జలమండలి కార్యాలయంను నిర్మించనున్నా రు. అప్పటి వరకు హఫీజ్‌పేట్‌లో ఉన్న శేరిలింగంపల్లి డివిజన్ (ప్రస్తుతం) కార్యాలయం నుంచి 2 డివిజన్‌ల కార్యకలాపాలు నిర్వహించనున్నారు.

- హఫీజ్‌పేట్ 17వ డివిజన్‌లో మంచినీటి కనెక్షన్లు 42,279 ఉండగా.. ఇందులో కమర్షియల్ కనెక్షన్లు 1470 ఉన్నాయి. దుర్గం చెరువు 15వ డివిజన్‌లో 42,023 తాగునీటి కనెక్షన్లలో విభజించిన తరువాత 4200 కమర్షియల్ కనెక్షన్లు ఉన్నాయి.
- త్వరలో దుర్గం చెరువు సమీపంలో నూతన భవనం నిర్మించిన తరువాత దుర్గం చెరువు 15వ డివిజన్ కార్యాలయం తరలి వెళ్ళనుంది. అప్పటి వరకు హఫీజ్‌పేట్‌లోని శేరిలింగంపల్లి డివిజన్ కార్యాలయం (ప్రస్తుతం)లోనే అధికారులు విధులు నిర్వహించనున్నారు.


డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ సచివాలయంలో కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించారు – గచ్చిబౌలి

కేడీహెచ్‌కే కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నిక

సాక్షి, సిటీబ్యూరో: చందానగర్ అర్జున్‌రెడ్డి కాలనీలోని ఖాన్సదేవి హోమ్స్, ఖ్యాతి అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికలో బురిది తిరుపతి రావు, కె. ఈశ్వరరావు, వెంకటసాయికృష్ణ, ఎన్. వేణుగోపాల్, మధుకిరణ్‌రెడ్డి, వెంకట సురేష్ కుమార్, సూర్యతేజ, శ్రవణ్ కిషోర్, ఎస్.ఎస్ శ్రీనివాసులు ప్యానల్ గెలుపొందింది.

నేడు ప్రత్యేక పూజలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్ ఎక్స్‌టెన్షన్ అవంతినగర్‌లోని రామాంజనేయస్వామి ఆలయంలో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారికి మంగళవారం పంచామృతాభిషేకం, మహా మంగళహారతి ఉంటుందని అర్చకులు తెలిపారు. కాల సర్ప దోషము, నాగదోషం, కుజ దోషం నివృత్తి, వివాహం, సంతానం కొరకు స్వామి వారికి అభిషేకము నిర్వహించబడునని తెలిపారు.

పొగాకు నియంత్రణపై ర్యాలీ, ప్రతిజ్ఞ


అవగాహన కల్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: పొగాకు రహిత సమాజానికి కృషి చేయాలని జిల్లా నియంత్రణ విభాగాధికారి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు బస్టాండ్ పరిసరాలలో, ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడ ప్రాంతాల్లో పొగాకు నియంత్రణపై ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. పొగాకు వాడకం ద్వారా కలిగే దుష్పరిమాణాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... పొగాకు వాడకం పెరిగిందని, ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం 60 రోజులు టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0 ప్రారంభించడం జరిగిందన్నారు. గ్రామాలు, విద్యా సంస్థలను పొగాకు రహితంగా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. నేటి యువత సిగరెట్, గుట్కా, పాన్ మసాలాలు తీసుకోవడం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పొగాకు ఉత్పత్తులు తీసుకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

కాలనీలలో హాస్టళ్లు వద్దు



శ్రీరాంనగర్ కాలనీవాసుల ధర్నా

గచ్చిబౌలి: పీజీ హాస్టళ్లను నిషేధించాలని డిమాండ్ చేస్తూ శ్రీరాంనగర్ కాలనీ ఏ బ్లాక్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం కాలనీ అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ పీజీ హాస్టళ్ల వల్ల వ్యర్థాలు డ్రైనేజీలో చేరిపోవడంతో ఎక్కడికక్కడ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు.ఒక్కో హాస్టల్‌లో వందల సంఖ్యలో విద్యార్థులు ఉండటంతో నీరు సరిపోవడం లేదని, పార్కింగ్ వసతి లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య నెలకొని వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కల్గుతున్నాయన్నారు. ఇళ్లను హాస్టళ్లకు అద్దెకు ఇవ్వవద్దని వారు యజమానులకు సూచించారు.పైగా రాత్రి సమయంలో మద్యం తాగి న్యూసెన్స్ చేస్తున్నారని పోలీసులకు, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేడిశెట్టి రాము, విజయలక్ష్మి, వాణి, శ్రీదేవి, మాధవి, దేవిక, చంద్రమౌళి, తిరుపతి, నర్సింహారెడ్డి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీకన్సల్ట్-స్ట్రైపుల్ ఎంఓయూ

రాయదుర్గం: ప్రపంచవ్యాప్తంగా హెచ్‌ఆర్ సొల్యూషన్‌లను మార్చడానికి టీ హబ్ ప్రాంగణంలో సోమవారం స్ట్రైపుల్-టీకన్సల్ట్ మధ్య ఒప్పందం కుదిరింది. టీకన్సల్ట్ చైర్మన్ సందీప్ మక్తాల, స్ట్రైపుల్ సంస్థ సీఈఓ వెంకట్ బూరా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా చిన్న, మధ్య తరహా వ్యాపారాల కోసం ఏఐ ఆధారిత హెచ్‌ఆర్ పరిష్కారాలను అందించడం ఈ భాగస్వామ్యం లక్ష్యం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలకు అధునాతన హెచ్‌ఆర్ పరిష్కారాలను తీసుకు రావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. స్ట్రైపుల్ మార్కెటింగ్ హెడ్ షేక్ జిలానీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గౌతమ్, టీకన్సల్ట్ నుంచి ఈశ్వర్, రాజీవ్ రావులపాటి, వంశీ, నరేందర్ పాల్గొన్నారు.

సంత నిర్వహణకు అనుమతి ఇవ్వండి


ఏఎంఓహెచ్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వ్యాపారులు, స్థానికులు

రాయదుర్గం: ఖాజాగూడలో సంత నిర్వహణకు అనుమతి ఇవ్వాలంటూ కూరగాయల వ్యాపారులు, మాజీ కార్పొరేటర్ సాయిబాబా ఆధ్వర్యంలో సోమవారం జీహెచ్‌ఎంసీ అధికారులను కలిశారు. శేరిలింగంపల్లి సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ సంత వద్దంటే వారు తమ జీవనోపాధిని కోల్పోతారని వారికి న్యాయం చేయాలని కోరారు. సంత నిర్వహణకు సరైన స్థలాన్ని కేటాయించే వరకు సంతను కొనసాగించేలా చూడాలని కోరారు.

సమాచారం



రాయదుర్గం: లింగంపల్లి–మెహిదీపట్నం(216కె/ఎల్) బస్సులు.. ప్రయాణికుల సౌకర్యార్థం నిత్యం పది ఎలక్ట్రికల్ బస్సులు నడుస్తాయి. 10 నిమిషాలకో బస్సు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. లింగంపల్లి నుంచి చందానగర్, గంగారం, మదీనాగూడ, ఆల్విన్ ఎక్స్‌రోడ్, హఫీజ్‌పేట్, కొండాపూర్, కొత్తగూడ ఎక్స్‌రోడ్, అంజయ్యనగర్, టెలికామ్‌నగర్, బయోడైవర్సిటీ కాంప్లెక్స్ కూడలి, రాయదుర్గం, షేక్‌పేట్ నాలా, టోలిచౌకి, నానల్‌నగర్ మీదుగా మెహిదీపట్నం వెళుతుంది.

కొత్త అసిస్టెంట్ ఇంజనీర్ల నియామకం

చందానగర్: జీహెచ్‌ఎంసీ చందానగర్ సర్కిల్ 21లోని ఇంజనీరింగ్ విభాగంలో కొత్తగా ముగ్గురు అసిస్టెంట్ ఇంజనీర్లు సంతోష్, పావని, మన్నెం నాయక్ సోయవారం విధుల్లో చేరారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న ఇంజనీర్లు పబ్లిక్ హెల్త్ విభాగం నుంచి వచ్చి చేరారు. ఇప్పటి వరకు సర్కిల్ 21లో ముగ్గురు ఏఈలు ఉండగా మరో ముగ్గురు రావడంతో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెడతామని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

నేషనల్ సైన్స్ ఫెయిర్‌లో 'మనూ' మోడల్ స్కూల్ విద్యార్థులు

రాయదుర్గం: జాతీయ సైన్స్ ఫెయిర్‌లో మనూ మోడల్ స్కూల్ విద్యార్థులు రాణించారు. చెన్నయ్‌లోని పూనమల్లిలోని సనా మోడల్ స్కూల్‌లో నిర్వహించిన 17వ జాతీయ సైన్స్ ఫెయిర్‌లో 'మనూ' మోడల్ స్కూల్ మూడవ స్థానంలో నిలిచింది. సాదియా బేగం, మీర్జీ జోయాబేగంలు లైఫ్ సైన్సెస్ విభాగంలో 'వరి, గోధుమ విత్తనాల అంకురోత్పత్తి, విత్తనాల పారామితులపై యూవీ–సి రేడియేషన్ ప్రభావం' అనే అంశంపై ప్రాజెక్టును సమర్పించారు.ఈ సందర్భంగా వారికి మెమెంటో, ప్రశంసాపత్రాన్ని అందించారు.

గచ్చిబౌలిలో ఈఆర్‌ఓ ఆఫీస్ ఏర్పాటు చేయాలని వినతి

రాయదుర్గం: విద్యుత్‌శాఖ గచ్చిబౌలి డివిజన్ కార్యాలయ పరిధిలో ఎలక్ట్రికల్ రెవెన్యూ ఆఫీస్ (ఈఆర్‌ఓ)ను ఏర్పాటు చేయాలని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు టోలిచౌకీలోని తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. శేరిలింగంపల్లి మండలం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం అని అన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలో అత్యధిక వినియోగదారులు కలిగిన డివిజన్ అని విద్యుత్ బిల్లులలో తేడాలు వస్తే కూకట్‌పల్లి వరకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి ప్రస్తుతం మేడ్చల్ జిల్లా పరిధిలో ఉందని, వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అత్యధిక వినియోగదారులు కలిగిన చందానగర్ ప్రాంతంలో ఈఆర్‌ఓ ఆఫీస్‌ను ఏర్పాటు చేసినట్లయితే అందరికీ సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అధికారులు స్పందించి ఈఆర్‌ఓ ఆఫీస్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఎలక్ట్రిక్ వాహనాలు అందజేత

గచ్చిబౌలి: ఉపాధి కల్పనలో డిక్కీ తెలంగాణ చాప్టర్ చేపడుతున్న చర్యలు భేష్ అని ఎస్‌బీఐ డీజీఎం రోహిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కొండాపూర్‌లోని ఏఓ ఎస్‌బీఐ గచ్చిబౌలి, డిక్కీ తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకు ఎలక్ట్రిక్ వాహనాలు అందజేశారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ 20 మంది నిరుద్యోగ యువతకు ఎలక్ట్రిక్ వాహనాలు అందించామని అందులో 8 మంది మహిళలు కూడా ఉన్నారని తెలిపారు. డిక్కీ తెలంగాణ చాప్టర్ ప్రెసిడెంట్ దాసరి అరుణ, కోఆర్డినేటర్ దాసరి నారాయణ మాట్లాడుతూ ఓహెచ్ ఎమ్ కార్ల కంపెనీలో ఐదేళ్ల ఒప్పందం ప్రకారం రాబోయే రోజుల్లో 100 వాహనాలు మహిళలకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఏజీఎం వెంకటనారాయణ, సోమశేఖర్, ప్రవీణ్ కుమార్, అజయ్ రామ్,ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజావాణి .. 4 దరఖాస్తులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో ప్రజలు 4ఫిర్యాదులు అందజేశారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌కు 2, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలకు ఒక్కో దరఖాస్తు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఈఈ దుర్గా ప్రసాద్, ఏఎంసీలు ప్రేమ్‌కుమార్, అర్బన్ బయోడైవర్సిటీ సర్కిల్ మేనేజర్ యూసుఫ్ పాల్గొన్నారు.

108, 102 అంబులెన్స్‌ల తనిఖీ

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని జిల్లా ఆస్పత్రిలోని 108, 102 నియోనేటర్ అంబులెన్స్‌లను 108 రంగారెడ్డి జిల్లా మేనేజర్ శ్రీకాంత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరంతరం అందుబాటులో ఉండడమే కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అంబులెన్స్‌లలో ఆక్సిజన్ సరఫరా, రికార్డులను ఆయన పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. ఈఎంటీ రాంబాబు, జావీద్, కుమారస్వామి, పైలెట్ శివ, ప్రణయ్, ఖలీల్, గోపాల్ పాల్గొన్నారు.

'రీ కౌంటింగ్ చేయాలి'

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికలలో అధ్యక్ష పదవి ఓట్ల లెక్కింపుపై అధికార యంత్రాంగం తర్జన భర్జన పడుతున్నారు. సోమవారం హెచ్‌సీయూ గ్రీవెన్స్‌సెల్, ఎన్నికల కమిటీ క్యాంపస్‌లో సమావేశమయ్యారు. కాగా అధ్యక్షుని గెలుపుపై హెచ్‌సీయూ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. అయితే అధ్యక్ష పదవి ఓట్ల లెక్కింపు పారదర్శకంగా సాగలేదని రీకౌంటింగ్ చేయాలని ఇండిపెండెంట్ అభ్యర్థి ఆకాశ్‌భాటి డిమాండ్ చేస్తున్నారు.

ఠాణాకు చేరిన విద్యార్థుల గొడవ

మాదాపూర్: ఇద్దరు విద్యార్థుల నడుమ గొడవ తలెత్తిన ఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని డాక్టర్స్ కాలనీలో ఉంటున్న ఆదిత్య (19) శంకర్‌పల్లిలో లా రెండో సంవత్సరం చదువుతున్నాడు. అదే కళాశాలలో బీబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న సుమంత్ గౌడ్ నడుమ గొడవలు జరిగాయి. ఆదిత్య సుమంత్‌గౌడ్ తల్లిని దుర్భాషలాడాడు. కాగా ఆదిత్య శంకర్‌పల్లి నుంచి మాదాపూర్‌లోని డీ–మార్ట్ వద్ద దిగి ఇంటికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో సుమంత్‌గౌడ్ తన కారులో నలుగురు స్నేహితులను తీసుకొచ్చి బస్సు దిగుతున్న ఆదిత్యను కొట్టారు. బాధితుడు తనపై కత్తులతో దాడిచేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా అక్కడున్న కెమెరాలు పనిచేయడం లేదని, ఇద్దరిని పిలిపించి వివరాలు తెలుసుకుంటానని కృష్ణమోహన్ తెలిపారు.